సాక్షి
ప్రకాశం
మంగళవారం ౹ 12 ౹ డిసెంబర్ ౹ 2023

న్యూస్‌రీల్

జెడ్పీలో కారుణ్య నియామకాలు



నియామకపత్రాలు అందిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు సిటీ: జిల్లా పరిషత్ యాజమాన్యం పరిధిలో పనిచేస్తూ మరణించిన సిబ్బంది కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం కింద జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ నియామక ఉత్తర్వులు సోమవారం అందజేశారు. వంకాయలపాటి హిమబిందు చినగంజాం మండల పరిషత్‌లో టైపిస్ట్‌గాను, పాతకోట వెంకట శేష సాయిని గుడ్లూరు ఎంపీపీలో ఆఫీస్ సబార్డినేట్‌గా, గుంజి వెంకట మణికంఠ యశ్వంత్‌ను ఆఫీస్ సబార్డినేట్‌గా మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, మలపాక ప్రమీలను బేస్తవారిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్‌గా, పారా వందనను టంగుటూరు ఎంపీపీలో ఆఫీస్ సబార్డినేట్‌గాను, బల్లాని వెంకట అక్షయ్‌ను తాళ్లూరు ఎంపీపీలో ఆఫీస్ సబార్డినేట్‌గా నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ బి.జాలిరెడ్డి, డీవై. సీఈఓ సి.హనుమంతరావు, పరిపాలనాధికారి వాకా శ్రీనివాసరెడ్డి, గుమస్తా కిషోర్‌బాబు పాల్గొన్నారు.

కొండపికి ఆదిమూలపు.. ఎస్ఎన్‌పాడుకు మేరుగు



ఆదిమూలపు సురేష్



మేరుగు నాగార్జున



వరికూటి అశోక్‌బాబు

- బాపట్ల జిల్లా వేమూరు ఇన్‌చార్జ్‌గా వరికూటి అశోక్‌బాబు
- మూడు నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిల మార్పు

ఒంగోలు: జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం మూడు నియోజకవర్గాల్లో ఇన్‌చార్జులను మార్పుచేసింది. ఆయా నియోజకవర్గాల్లో పార్టీని గెలిపించే దిశగా పార్టీని బలోపేతం చేసే బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ యర్రగొండపాలెం శాసనసభ్యుడు. తాజా మార్పుల్లో భాగంగా సురేష్‌ను కొండపి నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిగా ప్రకటించారు. కొండపి ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వరికూటి అశోక్‌బాబుకు బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిగా ప్రకటించారు. వేమూరు ప్రస్తుతం శాసనసభ్యుడు, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగు నాగార్జునకు సంతనూతలపాడు నియోజకవర్గ బాధ్యతలను అప్పగించారు. సంతనూతలపాడు నియోజకవర్గానికి ప్రస్తుతం శాసనసభ్యునిగా టీజేఆర్ సుధాకర్‌బాబు వ్యహరిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం యర్రగొండపాలెం నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా ఎవరినీ నియమించలేదు.

వృత్తిలో ఎదిగేందుకు లా నేస్తం ఉపకరిస్తుంది

- లబ్ధిదారులకు లా నేస్తం చెక్కును అందచేసిన జేసీ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: వృత్తిలో ఎదిగి స్థిరపడేందుకు ప్రభుత్వం అందిస్తున్న లా నేస్తం యువ న్యాయవాదులకు ఎంతగానో ఉపకరిస్తుందని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం ద్వారా లా నేస్తం పథకాన్ని ప్రారంభించారు. ప్రకాశం భవనం నుంచి జాయింట్ కలెక్టర్, పలువురు లాయర్లు పాల్గొన్నారు. దీనిలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ లా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువ న్యాయవాదులు వృత్తిలో నిలుదొక్కుకునేందుకు మూడేళ్లపాటు ప్రతి ఒక్కరికీ నెలకు రూ.5 వేల చొప్పున ఏడాదికి రూ.60 వేలను రెండు విడతలుగా నగదును బ్యాంకు ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ప్రస్తుతం 189 మందికి ఈ ఏడాది జులై నుంచి డిసెంబర్ వరకు ఒక్కొక్కరికి రూ.30 వేల చొప్పున మొత్తం రూ.56,70,000 ప్రభుత్వం విడుదల చేసినట్లు తెలిపారు. లబ్ధిదారుల్లో ఎస్సీలు 34, ఎస్టీలు 11, బీసీలు 64, ఓసీలు 80 మంది ఉన్నట్లు వివరించారు. ఈ పథకం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 382 మందికి లబ్ధి కలిగినట్లు తెలిపారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని మొదటి మూడు సంవత్సరాల్లో వారు వృత్తిలో స్థిరపడేలా దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.



లా నేస్తం చెక్కును అందజేస్తున్న జేసీ కె.శ్రీనివాసులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు

ఒంగోలుకు చెందిన నేను పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఈ ఏడాది లా కోర్సు పూర్తి చేశాను. న్యాయవాద వృత్తిలో నిలుదొక్కుకునేందుకు కనీసం మూడేళ్లయినా పడుతుంది. అప్పటి వరకు ఆర్థిక అవసరాలకు తల్లిదండ్రులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతగానో ఉపకరిస్తుంది. ఎక్కడా లేని ఈ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు.

– లక్ష్మీ వైదేహి, లబ్ధిదారు

క్లుప్తంగా

20 కేజీల గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయి బ్యాగులతో ఎస్సై, సిబ్బంది

త్రిపురాంతకం: నేషనల్ హైవేపై గంజాయి అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని 20.960 కేజీల గంజాయి ప్యాకెట్లు బ్యాగులో తరలిస్తుండగా అదుపులోనికి తీసుకున్నారు. త్రిపురాంతకం హైవేపై వాహనాలను తనిఖీ చేసే సమయంలో వ్యక్తి అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు పట్టుకునే ప్రయత్నం చేయగా పారిపోయేందుకు ప్రయత్నించాడు. అతన్ని పట్టుకొని విచారించగా గంజాయి ప్యాకెట్లు ఉన్న రెండు బ్యాగ్‌లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు సీఐ పాపారావు, ఎస్సై బి.సుదర్శన్ తెలిపారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది బి. పాండురంగయ్య, రెడ్డినాయక్, శివరెడ్డి, మహేంద్ర బాబు ఉన్నారు.

నెలాఖరుకు శుక్లాల ఆపరేషన్లు పూర్తి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ నళిని

ఒంగోలు టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గుర్తించిన కంటి శుక్లంతో బాధపడుతున్న వారికి ఈ నెలాఖరుకల్లా ఆపరేషన్లను పూర్తి చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి ఆదేశించారు. సోమవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ చాంబర్‌లో పారా మెడికల్, ఆఫ్తాల్మిక్ అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఆపరేషన్లు పూర్తి చేసేందుకు ప్రాథమిక కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది సహకారం తీసుకోవాలని చెప్పారు. కంటి వెలుగు, జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో గుర్తించిన వారికి వారం రోజుల్లోగా ఏఎన్‌ఎంల ద్వారా కళ్లజోళ్లు పంపిణీ చేయాలని సూచించారు. జిల్లా అంధత్వ నివారణ అధికారిణి డాక్టర్ నళిని, వివిధ పీహెచ్‌సీల పారా మెడికల్, ఆఫ్తాల్మిక్ అధికారులు పాల్గొన్నారు.

క్రేన్ ఢీకొని వ్యక్తి మృతి



నారాయణరెడ్డి మృతదేహం

వెలిగండ్ల: మండలంలోని మొగళ్లూరు–మరపగుంట్ల గ్రామాల మధ్య ఆగి ఉన్న ట్రాక్టర్‌ను క్రేన్ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నర్సమాంబాపురం గ్రామానికి చెందిన ఉండేల నారాయణరెడ్డి(57) తన స్వగ్రామం నుంచి ఇంటి సామాన్ల కోసం ట్రాక్టర్‌ను సీఎస్‌పురం వెళుతున్నాడు. ఈ క్రమంలో మొగళ్లూరు–మరపగుంట్ల గ్రామాల మధ్య ట్రాక్టర్ హెడ్ లైట్లు పనిచేయకపోవడంతో రోడ్డు మార్జిన్‌లో దించి లైట్లు బాగు చేసుకుంటున్నాడు. ఈ సమయంలో వెనుక నుంచి వస్తున్న క్రేన్ వాహనం ట్రాక్టర్‌ను ఢీకొనడంతో నారాయణరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. క్రేన్ డ్రైవర్‌ను అదుపులోనికి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్‌కుమార్ తెలిపారు.

స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు స్పందన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి పని చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. స్పందన హాలులో స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యాక్రమం సోమవారం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ద్వారా దూర ప్రాంత ప్రజల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో దాదాపు 260 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. అధికారులు అర్జీలకు సంబంధించిన సమస్యలు తిరిగి పునరావృతం కాకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అర్జీలు పరిష్కరించడంలో సహేతుకత ఉండాలన్నారు. పరిష్కరించలేని సమస్యలను సంబంధిత అర్జీదారులను పిలిచి కారణాలను వివరించాలన్నారు. దీనిలో డీఆర్‌ఓ శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఉమాదేవి, లోకేశ్వరరావు, వరకుమార్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్ధవీడు మండలం పాపినేనిపల్లి గ్రామానికి చెందిన లింగన్న డయల్ యువర్ కలెక్టర్‌కు ఫోన్ చేసి తమ పొలంలోకి వెళ్లేందుకు దారి లేదని, దారి ఇప్పించాలని కోరాడు. పరిశీలించి సమస్యను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అర్ధవీడు తహశీల్దార్‌ను ఆదేశించారు.

పొదిలి మండలం నవమిట్ట గ్రామానికి చెందిన కే బాదుల్లా తన భూమికి సంబంధించి పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు చేయడంలేదని, ఎన్నిసార్లు కార్యాలయం చుట్టూ తిరిగినా స్పందించడం లేదని ఫిర్యాదు చేశాడు. పరిశీలించి తనకు పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశాడు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

- ఎస్పీ మలికా గర్గ్
- పోలీస్ గ్రీవెన్స్‌కు 124 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు సబర్బన్: స్పందన ఫిర్యాదులపై అలసత్వం వహించకుండా పోలీస్ అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ మలికా గర్గ్ ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 124 మంది ఎస్పీని కలిసి సమస్యలు విన్నవించారు. ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించిన ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులకు పరిష్కార నిమిత్తం పంపించారు. ఫిర్యాదులను చట్ట పరిధిలో విచారించి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. స్పందన ఫిర్యాదుల పరిష్కారం కోసం తీసుకున్న చర్యలపై కూడా నివేదిక ఇవ్వాలని సిబ్బందికి స్పష్టం చేశారు. ఫిర్యాదుల్లో ప్రధానమైన వాటిని పరిశీలిస్తే..

మార్కాపురం నుంచి కాకుమాను వీరమ్మకు సంబంధించిన వారసులు తమ ఆధార పత్రాలను తీసుకొచ్చి ఎస్పీ మలికగర్గ్‌ను కలిశారు. వీరమ్మ రాసిచ్చిన రిజిస్టర్డ్ వీలునామాతో పాటు ఇతర ఆధారాలను ఎస్పీకి అందించారు. మార్కాపురానికి చెందిన రెడ్డిపోగు గురవయ్య రెండు రకాల నకిలీ వీలునామాలు రాసుకుని ఒంగోలులోని రూ.కోట్ల విలువైన ఆస్తులను విక్రయించాడని వివరించారు.


తనకు బ్యాంకులో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి యర్రగొండపాలేనికి చెందిన హెమ్లా నాయక్ అనే వ్యక్తి రూ.1.60 లక్షలు తీసుకుని నమ్మించి మోసం చేశాడని పొన్నలూరు మండలానికి చెందిన బాధితురాలు ఎస్పీకి వివరించారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత డీఎస్పీలకు పంపి విచారణ చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి, ఒంగోలు ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, దిశ డీఎస్పీ శ్రీనివాసరావు, ఐసీసీఆర్ సీఐ దుర్గాప్రసాద్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

మృత్యు ‘వల’కు మత్స్యకారుడు బలి

- గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో ఘటన
- కుటుంబాన్ని ఆదుకుంటామని మత్స్యశాఖ జేడీ హామీ



మత్స్యకారుడు శేషగిరి(ఫైల్)



గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో పడిపోయిన శేషగిరిని వెతుకుతున్న మత్స్యకారులు

మద్దిపాడు: చేపలు పట్టేందుకు వల వేస్తున్న క్రమంలో అదే వల కాళ్లకు చుట్టుకుని నీట మునిగిన ఓ మత్స్యకారుడు విగతజీవిగా ఒడ్డుకు చేరాడు. ఈ విషాద సంఘటన మద్దిపాడు మండలంలోని అన్నంగి సమీపంలో గుండ్లకమ్మ రిజర్వాయర్ వద్ద చోటుచేసుకుంది. అందిన సమాచారం ప్రకారం.. అన్నంగి గ్రామంలో నివసిస్తున్న తుపాకుల శేషగిరి(40) సోమవారం ఉదయం 11 గంటల సమయంలో తోటి మత్స్యకారులతో కలిసి గుండ్లకమ్మ రిజర్వాయర్ వద్దకు వెళ్లాడు. వల వేస్తున్న క్రమంలో అకస్మాత్తుగా రెండు కాళ్లకు చుట్టుకుపోవడంతో శేషగిరి నీటిలో పడిపోయాడు. సమీపంలోని మత్స్యకారులు హాహాకారాలు చేస్తూ ఒడ్డున ఉన్నవారిని పిలిచారు. అందరూ కలిసి గాలాలతో శేషగిరిని లాగడానికి ప్రయత్నించారు. సాయంత్రం వరకు ప్రయత్నించగా చివరకు ఓ గాలానికి శేషగిరి మృతదేహం దొరకడంతో ఒడ్డుకు తీసుకొచ్చారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న మత్స్యశాఖ జేడీ ఆవుల చంద్రశేఖరరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని శేషగిరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబానికి అండగా నిలుస్తామని, ప్రభుత్వం తరఫున రావాల్సిన సాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు తేళ్ల పుల్లారావు, గ్రామ సర్పంచ్ అన్వేష్, దుడ్డు వినోద్ తదితరులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



శేషగిరి మృతదేహాన్ని బయటకు తెస్తున్న మత్స్యకారులు

ఇంటర్ విద్యార్థులకు బంపర్ ఆఫర్

- ఉద్యోగం చేస్తూనే ఉన్నత కోర్సులు చదువుకునే అవకాశం
- ఏడో నెల నుంచి నెలకు రూ.10 వేలు స్టైఫండ్
- ఈనెల 28, 29 తేదీల్లో అదే కాలేజీలో పరీక్ష
- ఆర్ఐవో ఎ.సైమన్ విక్టర్

ఒంగోలు: ఐటీ ఉద్యోగం చేస్తూనే డిగ్రీ, ఆపై కోర్సులను అభ్యసించే మంచి అవకాశం ఇంటర్ విద్యార్థులకు అందుబాటులో ఉందని ఆర్ఐవో ఎ.సైమన్ విక్టర్ తెలిపారు. స్థానిక తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హెచ్‌సీఎల్ కంపెనీ టెక్–బీ పరీక్షల్లో ప్రతిభ చూపిన వారికి ఈ అవకాశం కలుగుతుందన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో సాఫ్ట్‌వేర్ కంపెనీలు కాలేజీలకే వచ్చి నైపుణ్యంగల విద్యార్థులను ఎంపిక చేసుకుని వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి, ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు డిగ్రీ, పీజీ కోర్సులు చేసిన వారికే ఇలాంటి అవకాశం దక్కుతుందని, తాజాగా ఇంటర్ విద్యార్థులకు సైతం ఈ అవకాశం లభించనుందన్నారు. ఈనెల 16లోగా ఇందుకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ఇంటర్ రెండో సంవత్సరం చదివే విద్యార్థులు ఎవరైనా ఇందుకు అర్హులే అని చెప్పారు. హెచ్‌టీటీపీఎస్://బీఐటీ.ఎల్‌వై/టెక్‌బీజీవోఏపీ వెబ్‌సైట్‌లో విద్యార్థులు పూర్తి వివరాలను ఈనెల 16లోగా నమోదుచేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. తొలుత రాత పరీక్ష, ఆ తరువాత ఆంగ్ల నైపుణ్య పరీక్ష, ఈ రెండింటిలో ప్రతిభ చూపిన వారిని ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తారు. దీనిలో అర్హత సాధించిన వారికి ఏడాదిపాటు శిక్షణ ఉంటుందని, శిక్షణకాలంలో ఏడో నెల నుంచి నెలకు రూ.10 వేలు చొప్పున స్టైఫండ్ అందిస్తారన్నారు. శిక్షణ పూర్తయిన తరువాత మంచి జీతంతో ఉద్యోగం ఇస్తారు. పరీక్షను ఫోన్‌లో కూడా రాసే అవకాశం ఉందని, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు ఈనెల 28, 29 తేదీల్లో వారు చదువుతున్న కాలేజీలోనే పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య ఎప్పుడైనా 55 నిముషాలపాటు పరీక్షకు హాజరయ్యే అవకాశం ఇస్తారు. ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే ఈ పరీక్షకు విద్యార్థులు తమ సొంత ఫోన్లను కూడా ఉపయోగించుకునే సౌలభ్యం కల్పించారు. ఇంటర్ బోర్డుతో హెచ్‌సీఎల్ టెక్ బీ సాఫ్ట్‌వేర్ కంపెనీ చేసుకున్న ఒప్పందం మేరకు విద్యార్థులకు ఇటువంటి అరుదైన అవకాశం లభించనుంది. ఇంటర్‌లో ఎంపీసీ, ఎంఈసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ కోర్సులు చదివిన వారికి అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించి డీపీవో విభాగంలో ఉద్యోగాలు కల్పించనున్నారు. ఎంపికైన విద్యార్థులు ఉద్యోగం చేసుకుంటూనే డిగ్రీ, ఆపై స్థాయి కోర్సులను చదువుకోవచ్చు. ఇదే కాకుండా విద్యార్థులు అభ్యసించే ఉన్నత చదువులకు అయ్యే వ్యయంలో సెమిస్టర్‌కు రూ.15 వేలు హెచ్‌సీఎల్ కంపెనీ చెల్లిస్తుంది. ఇందుకు కాలేజీల ప్రిన్సిపాళ్లు విద్యార్థులను ప్రోత్సహించాలని కోరుతున్నామని, ఇందుకుగాను కాలేజీల స్థాయిలో అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నట్లు సైమన్ విక్టర్ తెలిపారు.

సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ అగ్రగామి

- ప్రజాసంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి



మాట్లాడుతున్న ప్రజా సంకల్పవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రంగసాయిరెడ్డి

ఒంగోలు సిటీ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉందని ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి అన్నారు. సోమవారం ఒంగోలులోని ప్రజా సంకల్ప వేదిక కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మదిరె రంగసాయిరెడ్డి మాట్లాడుతూ కుల, మత, వర్గ విబేధాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత నాలుగున్నరేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న అసైన్డ్ భూములపై రైతులకు శాశ్వత హక్కును కల్పించడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వం అమూల్ డైరీతో సహకార విప్లవంలో నాంది పలికిందన్నారు. వ్యవసాయ దిగుబడి 166 లక్షల టన్నులకు చేరుకోవడానికి కారణం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న విప్లవాత్మకమైన నిర్ణయాలేనన్నారు. నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాల భవనాలు అత్యాధునిక వసతులతో రూపుదిద్దుకున్నాయని తెలిపారు. ఇంగ్లిష్ మీడియం స్కూల్స్, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాల ద్వారా విద్యా ప్రమాణాలు పెద్ద ఎత్తున మారాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పంటలకు గిట్టుబాటు ధరను విస్మరించిందన్నారు. చంద్రబాబు నాయుడు ఇన్‌పుట్ సబ్సిడీ పొడిగించడం, సున్నావడ్డీ పథకాన్ని నిర్వీర్యం చేయడం, ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయకుండా తమ నిస్సహాయతను చాటుకున్నారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలన్నీ తమ పార్టీ సానుభూతిపరులకే అందజేశారన్నారు. గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థను అమల్లోకి తీసుకువచ్చి సంక్షేమ పథకాల న్నింటినీ ఇంటి ముంగిటకే తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు.

గడిచిన ఏడాదిలో ప్రమాదాల నివారణ



ప్రతిజ్ఞ చేస్తున్న క్వారీ యజమానులు, మేనేజర్‌లు, కార్మికులు



గ్రానైట్ క్వారీలను పరిశీలిస్తున్న అధికారులు, క్వారీ యజమానులు

- గ్రానైట్ భద్రతా వారోత్సవాలు ప్రారంభంలో మైన్స్ అండ్ సేఫ్టీ డైరెక్టర్ సుప్రియో చక్రవర్తి

చీమకుర్తి: గ్రానైట్ క్వారీల్లో గడిచిన ఏడాది ఎలాంటి ప్రమాదాలు జరగకపోవడం అభినందనీయమని మైన్స్ అండ్ సేఫ్టీ డైరెక్టర్ సుప్రియో చక్రవర్తి అన్నారు. ఈ సంవత్సరం కూడా క్వారీల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన భద్రతా ప్రమాణాలను పాటించాలని క్వారీ యజమానులకు సూచించారు. రామతీర్థంలో సోమవారం ప్రారంభమైన గ్రానైట్ భద్రతా వారోత్సవాల కార్యక్రమానికి మైన్స్ అండ్ సేఫ్టీ డైరెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని గ్రానైట్ క్వారీల్లో సోమవారం నుంచి 16వ తేదీ వరకు 21వ గ్రానైట్ భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. సోమవారం రామతీర్థంలోని పలు గ్రానైట్ క్వారీల్లో భద్రతా వారోత్సవాల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన భద్రతా ప్రమాణాలను పాటిస్తామని క్వారీ యజమానులు, మేనేజర్‌లు కార్మికులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. సోమవారం తనిఖీల్లో నిర్దేశించిన క్వారీల్లో రికార్డులను పరిశీలించి భద్రతా ప్రమాణాలను తనిఖీ చేశారు. తొలుత సుప్రియో చక్రవర్తికి క్వారీల యజమానులు వారోత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వారోత్సవాలకు ఆతిథ్యం వహిస్తున్న యాపిల్ గ్రానైట్ యజమాని శిద్దా సూర్యప్రకాష్, పల్లవ సుబ్బారెడ్డి, క్వారీల యజమానులు చలువాది బదరీనారాయణ, ఎంఏ అజీమ్, మేనేజర్‌లు, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- ఐదుగురికి గాయాలు



త్రిపురాంతకం నేషనల్ హైవేపై ప్రమాదానికి గురైన వాహనాలు

త్రిపురాంతకం: నేషనల్ హైవేపై ట్రాలీ ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా..ఐదుగురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే..త్రిపురాంతకం మండలం దూపాడు సమీపంలో రెండు వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో వలి (40) మృతి చెందాడు. ఇతనిది పల్నాడు జిల్లా మాచవరం మండలం గంగిరెడ్డిపాలెం. వంట మాస్టర్‌తో కలిసి క్యాటరింగ్ పనులకు మార్కాపురం వెళుతూ ప్రమాదానికి గురయ్యాడు. పిడుగురాళ్లకు చెందిన హుసేన్, కోటేశ్వరమ్మ మరో ముగ్గురు కలిసి మార్కాపురంలో ఓ వివాహానికి ఒప్పందరం కుదుర్చుకుని వెళుతూ ప్రమాదానికి గురయ్యారు. వీరిని వినుకొండ తరలించగా వలి మృతి చెందాడు. ఈ మేరకు ఎస్సై సుదర్శన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిఫెన్స్ మద్యం బాటిళ్ల పట్టివేత



పట్టుకున్న మద్యం బాటిళ్లతో సెబ్ అధికారులు

ఒంగోలు సబర్బన్: నగరంలో అనుమతి లేని డిఫెన్స్ మద్యం బాటిళ్లు, ఎన్‌డీపీఎల్ మద్యం బాటిళ్లను సోమవారం సెబ్ పోలీసులు పట్టుకొని బాటిళ్లు అక్రమంగా విక్రయిస్తున్న రిటైర్డ్ సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ కీలం చిన్న కేశవరెడ్డిని అరెస్టు చేశారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ లత అక్రమ మద్యం బాటిళ్లకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సెబ్ అడిషనల్ ఎస్పీ కె.నాగేశ్వరరావు, సెబ్ ఈఎస్ ఎం.సుధీర్‌బాబు ఆదేశాల మేరకు వచ్చిన సమాచారంతో రాజపానగల్ రోడ్డులోని సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ కీలం చిన్న కేశవరెడ్డి అక్రమంగా డిఫెన్స్ మద్యం బాటిళ్లతో పాటు నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్(ఎన్‌డీపీఎల్)మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో దాడి చేసి అతని వద్ద 24 డిఫెన్స్, 6 ఎన్‌డీపీఎల్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు వివరించారు. దాడుల్లో ట్రైనీ ఏఈఎస్ బి.సుబ్రహ్మణ్యం, ఎస్‌ఈబీ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎంవీ గోపాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ ఎంవి.కోటేశ్వరరావు, సిబ్బంది కుప్పాల శ్రీనివాసరావు, పెయ్యల శ్రీనివాసరావు, ఈ.హరిబాబు పాల్గొన్నారు.

మార్కాపురం సీఐ బదిలీ

మార్కాపురం: మార్కాపురం సీఐ ఎం.భీమానాయక్‌ను ఒంగోలు డీసీఆర్‌బీకు బదిలీ చేస్తూ ఎస్పీ మలికాగర్గ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాదిన్నర నుంచి మార్కాపురం సీఐగా బాధ్యతలు నిర్వహించారు. మార్కాపురం సీఐగా ఎవరినీ నియమించలేదు.

భార్యను వేధించిన భర్తకు జైలు

అర్ధవీడు(కంభం): భార్యను శారీరకంగా, మానసికంగా హింసించిన భర్తకు గిద్దలూరు ఏజేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి మేరీ శారధనమ్మ ఏడాది జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. అర్ధవీడు మండలంలోని పాపినేనిపల్లె గ్రామానికి చెందిన సద్దుల స్వాతి, ఎస్.సర్వేశ్వరరెడ్డి భార్యాభర్తలు. చెడు అలవాట్లకు బానిసైన సర్వేశ్వరరెడ్డి తన భార్యను శారీరకంగా, మానసికంగా హింసించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై శశికుమార్‌తో కేసు నమోదు చేశారు. సమగ్ర దర్యాప్తు చేపట్టి గిద్దలూరు ఏజేఎఫ్‌సీఎమ్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ఎస్.రఘునాథరావు వాదించారు. నిందుతుడిపై నేరారోపణలు రుజువు కావడంతో జడ్జి మేరీశారధనమ్మ నిందితుడికి ఏడాది జైలు శిక్షతోపాటు వంద రూపాయలు జరిమానా విధించారు. గుడ్ ట్రయల్ మానిటరింగ్ నిర్వహించిన ఎస్సై, పోలీస్ సిబ్బందిని ఎస్పీ మలికా గర్గ్ ప్రత్యేకంగా అభినందించారు.

18 వరకు పంట నష్టం నమోదు

వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు

ఒంగోలు సెంట్రల్: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో జిల్లా దెబ్బతిన్న పంటల వివరాలు సేకరిస్తున్నట్లు జేడీఏ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 18వ తేదీ వరకు సచివాలయాల పరిధిలో వ్యవసాయాధికారులు, వీఏఏలు పంట నష్టాన్ని నమోదు చేస్తారని పేర్కొన్నారు. జాబితాను 22వ తేదీ వరకు సచివాలయాల్లో ప్రదర్శించి, 23న అభ్యంతరాలు స్వీకరిస్తామని, 25న తుది జాబితాను ఖరారు చేస్తామని వివరించారు. సోమవారం సేకరించిన పంట నష్టం వివరాలను జేడీఏ వెల్లడించారు.

పంట	రైతుల సంఖ్య	నష్టం (ఎకరాల్లో)
వరి	5822	18,200
మొక్కజొన్న	2,612	4000
మినుము	3637	5702.5
పొగాకు	14056	19,250
జొన్న	670	860
వేరుశనగ	43	50
అలసంద	88	105
నువ్వులు	142	187.5
మొత్తం	27,070	48,355

జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం



నిప్పట్లపాడులో పథకాల గురించి వివరిస్తున్న ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు



ఉప్పుగుండూరులో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్

● ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు

చీమకుర్తి: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామని ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిప్పట్లపాడు గ్రామంలో నిర్వహించారు. గ్రామంలో గడిచిన నాలుగున్నరేళ్లలో రూ.15 కోట్ల విలువ కలిగిన సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారని గుర్తు చేశారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, సర్పంచ్ రావులపల్లి కోటేశ్వరరావు, నాయకులు చీదర్ల శేషు, మాలకొండయ్య, యోగయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ అవసరం ఎంతో ఉంది...

నాగులుప్పలపాడు: పేద ప్రజల గొంతుక తానై వారి అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవసరం ఈ రాష్ట్రానికి ఎంతో ఉందని మద్దిపాడు ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉప్పుగుండూరు సచివాలయం–2 పరిధిలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత సచివాలయం పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా చేకూరిన లబ్ధికి సంబంధించిన బోర్డులను ప్రదర్శించారు. అనంతరం ఇప్పటి వరకు జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాల నిధుల గురించి వివరించారు. పంచాయతీలో చేసిన అభివృద్ధిని మెచ్చి మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ అన్నారు. అనంతరం బస్టాండ్ కూడలిలో పార్టీ జెండా ఆవిష్కరించి ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయమణి, గ్రామ సర్పంచ్ దేవరకొండ జయమ్మ, ఎంపీటీసీలు తాటి అనురాధ, మున్నంగి వెంకట్రావు, మాదాసు రాంబాబు, కొలకలూరి విజయ్‌కుమార్, పెంట్యాల శ్రీను, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

16న చీమకుర్తిలో సైన్స్ ఫెయిర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

చీమకుర్తి: మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఫెయిర్) కార్యక్రమాన్ని ఈ నెల 16న చీమకుర్తిలోని ప్రభుత్వ హైస్కూల్లో నిర్వహించనున్నట్లు ఎంఈఓ–1, 2 వెంకటేశ్వర్లు, శివాజీ తెలిపారు. సోమవారం చీమకుర్తి ఎంఆర్‌సీలో మండలంలోని అన్ని హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. 16న మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో గల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి శాస్త్రీయ ప్రాజెక్టులు ప్రదర్శించాలని తెలిపారు.

రైతు నాయకులపై కక్ష సాధింపు తగదు



వినతిపత్రం అందజేస్తున్న రైతు నాయకులు

ఒంగోలు టౌన్: రైతు వ్యతిరేక వ్యవసాయ బిల్లులను నిరసిస్తూ నిర్వహించిన ఉద్యమంలో పాల్గొన్న జాతీయ రైతు నాయకులపై నిర్బంధాన్ని ఆపాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా నాయకులు సోమవారం కలెక్టరేట్‌లోని జరిగిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇటీవల అనేక మంది రైతు నాయకులపై నేరపూరిత కేసులు బనాయించిందని తెలిపారు. ఢిల్లీ పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థల తీరు కక్షసాధింపు చర్యలుగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి కుట్రపూరిత చర్యలను ప్రజలు హర్షించరని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తరఫున వ్యవసాయ కార్యదర్శి ఇచ్చిన రాతపూర్వక హామీని నమ్మి రైతు నాయకులు ఉద్యమాన్ని విరమించారని, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి తోమర్ సైతం రాజ్యసభలో కేసులను ఉపసంహరించుకుంటామని చెప్పారని గుర్తు చేశారు. చట్టసభలలో ఇచ్చిన హామీని అమలు చేయకుండా రైతు నాయకులను ఇబ్బందులకు గురి చేయడం సమర్థనీయం కాదన్నారు. మోదీ ప్రభుత్వం తీవ్రమైన ద్రోహానికి పాల్పడిందని మండిపడ్డారు. రైతు నాయకులపై పెట్టిన కేసులను ఉపసంహరించాలని, లేకపోతే మరో ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా రైతు నాయకలు చుంచు శేషయ్య, ఎస్.లలితకుమారి, ఎల్.ఆంజనేయులు, కామేపల్లి శ్రీనివాసరావు, చావలి సుధాకర్, బి.సుబ్బారావు, హనుమారెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారునికి ఆర్థిక సాయం



విశ్వసాయికి నగదు అందిస్తున్న మారం వెంకారెడ్డి

చీమకుర్తి: డాడ్జ్‌బాల్ క్రీడాకారుడు విశ్వసాయికి వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి సోమవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. సౌదీ అరేబియాలో జరగనున్న ఇంటర్నేషనల్ డాడ్జ్‌బాల్ పోటీల్లో విశ్వసాయి పాల్గొననున్నందున రాకపోకల ఖర్చులకు నగదు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రం బాగుండాలంటే జగనే సీఎం కావాలి

- ఒంగోలు 26వ డివిజన్‌లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న రవిచంద్ర, నాయకులు, సచివాలయ సిబ్బంది

ఒంగోలు సబర్బన్: ఏపీకి ఎక్కువ కాలం ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటేనే రాష్ట్రం బాగుపడుతుందని వైఎస్సార్ సీపీ నాయకులు, జేసీఎస్–2 ఇన్‌చార్జ్ కొమ్మూరి రవిచంద్ర అన్నారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న 26వ డివిజన్‌కు చెందిన వార్డు సచివాలయంలో సోమవారం ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు జాజుల కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొమ్మూరి రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్రం సమగ్ర అభివృద్ధి దిశగా అడుగులు ముందుకు వేయాలంటే ఎక్కువ కాలం రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం జగన్‌ను వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదిస్తేనే పేదల బతుకులు బాగుంటాయన్నారు. విద్య, వైద్య రంగాల్లో సంచలన మార్పులు తీసుకొచ్చిన అతి చిన్న వయసు ముఖ్యమంత్రిగా దేశ చరిత్రలో జగన్ నిలిచిపోతారన్నారు. సంక్షేమ సారథిగా దేశంలో ఏ ముఖ్యమంత్రి అందించని విధంగా పేదలకు ఆర్థిక సాయాన్ని నేరుగా వారి బ్యాంకు అకౌంట్లలో జమచేశారన్నారు. దళారుల వ్యవస్థకు స్వస్తి పలికి మానవత్వం ఉన్న ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదలను గుర్తించి మరీ ఇంటి పెద్ద కుమారునిగా ఆదుకోవడం ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రికీ సాధ్యం కాలేదన్నారు. 14 సంవత్సరాలు సీఎం అని చెప్పుకునే చంద్రబాబు ఇంకా బూటకపు హామీలిస్తున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు చూసి చంద్రబాబు వెన్నులో వణుకు పడుతోందన్నారు. 26వ డివిజన్‌లో ఇప్పటి వరకు రూ.8.15 కోట్లతో పేదలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలియజేసే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం డివిజన్‌లో ఇంటింటికి తిరిగి రాష్ట్రానికి జగన్ ఎందుకు అవసరమో ప్రతి ఒక్కరికీ వివరించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఏఈ, సచివాలయ అడ్మిన్, సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకుడు రావులపల్లి నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

పరిపాలనపై అవగాహన అవసరం

- ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత



పంచాయతీ కార్యదర్శులకు పరిపాలన విధానంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సుజాత

కొత్తపట్నం: గ్రామ పంచాయతీలలో ఉమ్మడి పరిపాలనా విధానం, సొంత ఆదాయ వనరులపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన అవసరమని ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల ఆవిర్భావాన్ని, పంచాయతీల ప్రాధాన్యతను వివరించారు. స్థానిక సంస్థల పితామహుడు లార్డ్ రిప్పన్ స్థానిక సంస్థల కోసం చేసిన కృషిని వివరించారు. పంచాయతీ పాలనకు సంబంధించిన జీవోలను సంక్షిప్తంగా వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ చట్టాన్ని 1951లో తీసుకురావడం జరిగిందని, ఆ తర్వాత 73వ రాజ్యాంగ సవరణ ద్వారా దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ 3 అంచెల స్థానిక సంస్థల వ్యవస్థ అమలు చేయాలని చట్టం చేయబడిందని వివరించారు. గ్రామ పంచాయతీ లెవెల్‌లో పంచాయతీ కార్యదర్శి విధి విధానాలను అందరికీ వివరించారు. ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీల స్వరూపం–గ్రామ పంచాయతీల నిర్వచనం, రాష్ట్ర ప్రభుత్వానికి, గ్రామ పంచాయతీకి సంబంధించి పంచాయతీ సాధారణ ముద్ర, చిహ్నం, కార్యనిర్వహణ అధికారం, సర్పంచ్ మధ్య గల తేడా, పంచాయతీ కార్యదర్శుల విధులు, నిధులు, జమలు, ఖర్చు, సాధారణ నిధులు, వాటిని గ్రామ అభివృద్ధికి ఏ విధంగా ఉపయోగించాలి, ఎంత శాతాల్లో వినియోగించాలి, వర్క్‌లకు సంబంధించిన ఫ్లోచార్ట్ వంటి ఎన్నో పరిపాలనాపరమైన అంశాల గురించి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో–2 పద్మ, అల్లూరు పంచాయతీ కార్యదర్శి ఐపీ రామారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర ఆటలను విజయవంతం చేయాలి...

ఆడుదాం ఆంధ్ర ఆటలను విజయవంతం చేయాలని ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత పిలుపునిచ్చారు. కొత్తపట్నం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్ర ఆటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నెల 15 నుంచి జరిగే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో నిర్వహించాల్సిన వివిధ రకాల క్రీడల గురించి వివరించారు. ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు గ్రామ స్థాయిలో, వచ్చే ఏడాది జనవరి 2 నుంచి 15వ తేదీ వరకు మండల స్థాయిలో, జనవరి 16 నుంచి 21వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో, 22 నుంచి 28వ తేదీ వరకు జిల్లా స్థాయిలో, జనవరి 29 నుంచి ఫిబ్రవరి 3 వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగుతాయని వివరించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ మొదలగు పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పంచాయతీలకు గ్రామ పంచాయతీ సెక్రటరీ ఛైర్మన్‌గా, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ సెక్రటరీగా ఉంటారన్నారు. గ్రూపులో సచివాలయం పరిధిలోని పాఠశాల హెడ్మాస్టర్, కానిస్టేబుల్, ఏఎన్ఎం సభ్యులుగా ఉంటారన్నారు. మండల స్థాయిలో జరిగే పోటీలకు ఎంపీడీవో ఛైర్మన్‌గా, తహసీల్దార్ సెక్రటరీగా ఉంటారన్నారు. వీటితో పాటు సభ్యులుగా మండల విద్యాశాఖాధికారి, సచివాలయం పరిధిలో హైస్కూల్ హెచ్ఎం సభ్యులుగా, మండల లెవల్ ఆఫీసర్లు సభ్యులుగా ఉంటారన్నారు. వీరందరి సహకారంతో ఆడుదాం ఆంధ్రా ప్రోగ్రామ్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యాశాధికారి పద్మావతి, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, హైస్కూల్ పీడీ సాయకిషోర్ పాల్గొన్నారు.

తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

ఒంగోలు టౌన్: మిచాంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన పొగాకు, వరి, మిర్చి, పత్తి, శనగ రైతులను తక్షణమే ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి డీవీఎస్ స్వామి డిమాండ్ చేశారు. జిల్లాలోని రైతాంగం కరువుతో పాటు తుఫాన్ వలన తీవ్రంగా నష్టపోయిందని తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లకు వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. జిల్లాలోని 31 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, రైతులకు పశుగ్రాసం, వ్యవసాయానికి అవసరమైన ఎరువులను ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలని, ఉపాధి హామీ కూలి రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒంగోలు, అద్దంకి ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్.లలితకుమారి, పీవీఆర్ చౌదరి, ఆర్.మోహన్, వడ్డే హనుమారెడ్డి, వెంకటరావు, ఎంఎస్ సాయి పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన వాసవీ క్లబ్ సభ్యులు

చీమకుర్తి: సంతనూతలపాడు వాసవీ క్లబ్, మహిళా క్లబ్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా వేమూరి వెంకట శేషారావు, గౌరవ అధ్యక్షునిగా పీ వెంకటేశ్వర్లు, సెక్రటరీగా టీ సురేష్, ట్రెజరర్‌గా పీ సుధాకర్‌ను ఎన్నుకున్నారు. మహిళా క్లబ్ అధ్యక్షులుగా చలువాది చంద్రావతి, గౌరవ అధ్యక్షులుగా జీ పద్మజ, సెక్రటరీగా ఎస్.జయశ్రీని ఎన్నుకున్నారు. ఎన్నికైన వారు 2024 సంవత్సర నూతన కమిటీగా పనిచేస్తారని తెలిపారు. నూతన కమిటీకి వాసవీ, మహిళా క్లబ్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షేమ పథకాలే అభివృద్ధికి మూలం

● ఒంగోలు ఎంపీడీవో అజిత



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అజిత

ఒంగోలు రూరల్: సంక్షేమ పథకాలే అభివృద్ధికి ప్రధాన మూలమని ఒంగోలు ఎంపీడీవో పి.అజిత అన్నారు. మండలంలోని దేవరంపాడు గ్రామంలో సోమవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆమె పాల్గొన్నారు. సర్పంచ్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన కార్యదర్శులు స్వాతి, సుజాత కన్వీనర్లుగా వ్యవహరించిన బహిరంగ సభలో ఎంపీడీవో మాట్లాడుతూ దేశానికి రాష్ట్రాలే పట్టుకొమ్మలని, రాష్ట్రాలు ప్రవేశపెట్టే పథకాలు ప్రజలకు అందుతున్న తీరు, అవి సాధించే ఫలితాల ప్రకారమే దేశాభివృద్ధి వేగంగా జరుగుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయడం మంచి విషయమన్నారు. ఆ సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందేలా ప్రతి ఒక్క దశలో ఆయా ప్రభుత్వాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఈ పర్యవేక్షణలో వలంటీర్, సచివాలయ వ్యవస్థలు కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. మండలస్థాయిలో ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం పర్యవేక్షిస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే ప్రతి ఒక్క పథకాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లే బాధ్యత ఆయా శాఖల సచివాలయ సిబ్బంది, కార్యదర్శి, వలంటీర్ వ్యవస్థపై ఉందన్నారు. కరవది పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ఎస్.వాణి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంల ద్వారా ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించే విధానాన్ని వివరించారు. ప్రపంచ దేశాలు మెచ్చుకునేలా కరోనా తీవ్రతను ఎదుర్కొన్నామని అన్నారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్‌భవ కార్యక్రమం గురించి వివరించారు. దేవరంపాడు, దేవరంపాడు దళితవాడలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్న ఇద్దరు.. ఆరోగ్యశ్రీ ఎలా తమ ప్రాణాలు కాపాడిందో వివరించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎలిజబెత్‌రాణి మాట్లాడుతూ చిన్నారులు, కౌమార బాలికలు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పోషకాహారం, వివిధ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఎం గోపీనాథ్ మాట్లాడుతూ జీవనజ్యోతి, పీఎం ఈజీపీ, ఎన్‌ఆర్‌ఎల్ శ్రీనిధి, ఉజ్వలయోజన, ముద్రయోజన పథకం గురించి వివరించారు. హౌసింగ్ ఏఈ పృథ్వీ గృహ వసతులు లేనివారికి ఇళ్ల పట్టాలు అందజేసి మౌలిక సదుపాయాలు కల్పించారని, ఇంకా గృహాలు నిర్మించుకోలేని వారి పేర్లు వెంటనే తెలియజేయాలని కోరారు. వ్యవసాయశాఖ ఏడీ ప్రభాకర్ నానోటెక్నాలజీ యూరియా డ్రోన్‌ను ఉపయోగించి ఫెర్టిలైజర్ మందులను పంట పొలాలకు అందించే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మెడికల్ వెటర్నరీ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఏవో, ఏడీ ఆధ్వర్యంలో డ్రోన్ పనిచేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల డ్వాక్రా సంఘ మహిళలు, స్థానిక ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రాజేశ్వరి పాల్గొన్నారు.

దోమల నివారణకు మందు పిచికారీ


ఎబేట్ మందు చల్లిస్తున్న కార్యదర్శి విజయలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో దోమల నివారణకు ఏబేట్ మందు చల్లించినట్లు గ్రామ కార్యదర్శి విజయలక్ష్మి తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఖాళీ ప్రదేశాలలో నీరు నిల్వ ఉండి దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని, అందువలన గ్రామం మొత్తం దోమల లార్వాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నీటి కుంటల్లో ఆయిల్ బాల్స్ వదిలారు. సైడు కాలువలు తీయించి దోమల నివారణకు మందు చల్లించారు. సాయంత్రం గ్రామం మొత్తం ఫాగింగ్ చేయిస్తున్నట్లు తెలిపారు. దోమల నివారణకు సూపర్‌వైజర్ బాలకోటయ్య ప్రత్యేక చర్యలు తీసుకుని ఆయిల్‌బాల్స్ చేయించి మురుగునీటిలో వేయించారు, కార్యక్రమంలో వైద్యశాఖ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు విద్యార్థుల ఎంపిక


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఒంగోలు: జాతీయస్థాయిలో నిర్వహించే సీబీఎస్‌ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌కు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని స్థానిక సాయిబాబా సెంట్రల్ స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సాయినాథుని శృతి తెలిపారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల మొదటివారంలో విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీబీఎస్‌ఈ రీజినల్ సైన్స్ ఎగ్జిబిషన్ పోటీల్లో తమ విద్యార్థులు రాణించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. సెకండరీ విభాగంలో తమ విద్యార్థులు పి.కీర్తి, చంద్రిక, డి.వైష్ణవి ×తెల్ల ఆవాల మొక్కల ద్రావణంతో కూరగాయ మొక్కల అభివృద్ధి₹ అనే నమూనాను రూపొందించి ప్రదర్శించారన్నారు. వీరి నమూనా జనవరిలో జరిగే జాతీయస్థాయికి ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ జీవీ భాస్కర్, ప్రిన్సిపాల్ మహేష్, శశిలక్ష్మి, గైడ్ టీచర్ కె.కళ్యాణి, సుదర్శన్ అభినందించారు. ఈ నమూనా మెరుగైన ఫలితాలను అందించి రైతుల జీవితాలలో మంచి మార్పు తీసుకొస్తుందని, జాతీయస్థాయిలో కూడా ఈ ప్రాజెక్టు ఎంపికవ్వాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

కారు ఢీకొని మరణించిన 32 గొర్రెలకు పోస్టుమార్టం


మృతిచెందిన గొర్రెలకు పోస్టుమార్టం చేస్తున్న డాక్టర్ బేబీరాణి

కొత్తపట్నం: ఒంగోలు–కొత్తపట్నం రోడ్డులో అల్లూరు వద్ద ఆదివారం సాయంత్రం కారు ఢీకొని మృతిచెందిన 32 గొర్రెలకు సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.బేబీరాణి, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శంకర్, ప్రాంతీయ వైద్యాధికారి వి.శోభ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితుడు కొల్లపోయిన సోమయ్యను అడిగి ప్రమాదం జరిగిన తీరు గురించి తెలుసుకున్నారు. గొర్రెలు ఎటువైపు నుంచి వస్తున్నాయి, కారు ఎటువైపు నుంచి వచ్చింది, ప్రమాదం ఎలా జరిగింది, మృతిచెందిన గొర్రెల విలువ ఎంత ఉంటుంది..? అనే వివరాలడిగి తెలుసుకున్నారు. బేబీరాణి స్వయంగా పోస్టుమార్టం నిర్వహించారు. గొర్రెలకు ఇన్సూరెన్స్ చేసి ఉందని, వైఎస్సార్ పశు బీమా పథకం ద్వారా ఒక్కో గొర్రెకు రూ.6 వేలు వస్తుందని, పూర్తి సమాచారం ఇన్సూరెన్స్ కంపెనీకి పంపించి ఇన్సూరెన్స్ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గాయపడిన మరో 7 గొర్రెలకు చికిత్స అందించారు. త్రోవగుంట నుంచి వచ్చిన పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శంకర్, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే బాలినేని జన్మదినం

- ఒంగోలు నగరంలో వేడుకలు, పలు సేవా కార్యక్రమాలు


ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని మంగళవారం ఘనంగా వేడుకలతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ కటారి శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు బాలినేని నివాసంలో జరిగే కార్యక్రమంలో అభిమానులు, నాయకుల సమక్షంలో బాలినేని శ్రీనివాసరెడ్డి కేక్ కట్ చేస్తారని తెలిపారు. అనంతరం అభిమానులు గజమాలలతో వాసన్నను సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తారన్నారు. సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. బాలినేని శ్రీనివాసరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని అభిమానులు, నాయకులు ఏర్పాటు చేసే పలు సేవా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్ రెడ్డి పాల్గొంటారన్నారు. ఉదయం 10.30 గంటలకు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు ఆధ్వర్యంలో కేక్ కటింగ్, రక్తదాన శిబిరం, స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందన్నారు. 11 గంటలకు స్థానిక విశ్వసేవిక వృద్ధుల ఆశ్రమంలో ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ రమాదేవి ఆధ్వర్యంలో నిత్యావసరాల పంపిణీ, 11.15 గంటలకు మాతాశిశు వైద్యశాలలో వైద్యశాల డైరెక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, పండ్లు, రొట్టెల పంపిణీ, 11.30 గంటలకు నగర రేషన్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బధిరుల పాఠశాలలో కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. 12 గంటలకు స్థానిక 44వ డివిజన్‌లో కార్పొరేటర్ గోపిరెడ్డి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మారుతీనగర్ 2వ లైనులోని ప్రసన్న ఆంజనేయస్వామి గుడివద్ద అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. 12.30 గంటలకు స్థానిక ఘోషా హాస్పిటల్ వద్ద ఉన్న బీసీ బాలికల వసతి గృహంలో వైఎస్సార్ సీపీ నాయకుడు బత్తుల కాశయ్య ఆధ్వర్యంలో కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కటారి శంకర్ కోరారు.

బాలినేని పుట్టినరోజు ముందస్తు వేడుకలు

చీమకుర్తి: ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు సందర్భంగా పేర్నమిట్టలోని 40వ డివిజన్‌లో కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం జన్మదినం సందర్భంగా ముందుగా కేక్ కట్‌చేసి బాలినేనికి శుభాకాంక్షలు తెలిపారు.


కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ చంద్రశేఖర్

అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన పోలీసులు

- అభినందించిన ఎస్పీ మలికాగర్గ్


పతకాలు సాధించిన పోలీస్ క్రీడాకారులతో ఎస్పీ మలికాగర్గ్, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర స్థాయి 42వ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించిన క్రీడాకారులైన పోలీసులను సోమవారం ఎస్పీ మలికాగర్గ్ అభినందించారు. స్థానిక జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో క్రీడాకారులు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. పలు విభాగాల్లో 13 పతకాలు సాధించటం ద్వారా ఓవరాల్ చాంపియన్‌షిప్ కూడా కైవసం చేసుకున్నారని ఎస్పీ కొనియాడారు. ఈ నెల 9 నుంచి రెండు రోజుల పాటు తిరుపతిలో నిర్వహించిన పోటీల్లో జిల్లాలోని పోలీసులైన క్రీడాకారులు ప్రతిభ ప్రదర్శించి పతకాలు సాధించడం జిల్లా పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంచుతుందన్నారు. ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న సుబ్బారావు ఒక గోల్డ్, ఒక సిల్వర్, ఒక బ్రాంజ్ పతకాలు సాధించారు. ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న ఎన్.వరలక్ష్మి మూడు గోల్డ్, ఒక సిల్వర్ మెడల్ సాధించారు. మద్దిపాడులో పనిచేస్తున్న ఏఎస్సై ఎం.వెంకటలక్ష్మి ఒక గోల్డ్, ఒక బ్రాంజ్ మెడల్, ఒంగోలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ డి.రాజేంద్ర ఒక సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్ సాధించారు. ఒంగోలు ట్రాఫిక్‌లోనే పనిచేస్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఈ.సునీల్ ఒక సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్ సాధించారు. 2024 ఫిబ్రవరిలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలని వారిని ఎస్పీ ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, ఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాస్, కోచ్‌లు పాల్గొన్నారు.

వైద్యశాఖలో రెసిడెంట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు టౌన్: ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న సీనియర్ రెసిడెంట్స్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఏ.ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లినికల్, నాన్ క్లినికల్, డెంటిస్ట్రీ ఉద్యోగాల నియామకం కోసం పోస్టు గ్రాడ్యుయేషన్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు వివరాలకు జీఎంసీ ఒంగోలు వెబ్‌సైట్ ప్రకాశం.ఏపీ.గవర్నమెంట్‌లో పొందుపరిచినట్లు వివరించారు. దరఖాస్తులను డౌన్లోడ్ చేసుకొని సంబంధిత సర్టిఫికెట్లను జతపరిచి సాఫ్ట్ కాపీని ఒంగోలు జీఎంసీ మెయిల్‌కు పంపించాలని తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే సమయంలో మూడు అటెస్టెడ్ కాపీలను తీసుకురావాలన్నారు. ఈ నెల 13న మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో అఖండ భజన

ఒంగోలు మెట్రో: నగరంలోని కేశవస్వామిపేటలో గల కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకమాసం సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆరు గంటల నుంచి సోమవారం సాయంత్రం ఆరు గంటల వరకు నిర్విరామంగా ఏకాహం అఖండ భజన నిర్వహించారు. చిన్ని కృష్ణ బృందం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం చిన్ని కృష్ణ బృందంను ఆలయ చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వహణాధికారి డి.రజనీకుమారి, అర్చకులు శంకరమంచి ప్రసాద్‌శాస్త్రి, శంకరమంచి రామకృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యుడు కుర్రా ప్రసాద్‌బాబు ఘనంగా సన్మానించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

జనవరి 5 నుంచి అంతర్జాతీయ తెలుగు మహాసభలు


తెలుగు మహాసభల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న సాహితీవేత్తలు

ఒంగోలు టౌన్: సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5, 6, 7 తేదీల్లో రాజమహేంద్రవరంలోని గోదావరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించే 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలను విజయవంతం చేయాలని ప్రకాశం జిల్లా రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు కోరారు. సోమవారం స్థానిక అన్నవరప్పాడులోని సూర్య విద్యానికేతన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మహాసభల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. తెలుగు భాషలోని 25 సాహితీ ప్రక్రియలపై మూడు రోజులపాటు సదస్సులు జరుగుతాయని పొన్నూరు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు కవులు, రచయితలు హాజరవుతారని తెలిపారు. యువ అవధానులతో అవధానం, సంచార జాతుల కళా ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు ప్రరసం జిల్లా కార్యదర్శి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యత్తపు కొండారెడ్డి తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ సభలలో ప్రకాశం జిల్లాకు చెందిన కవులు కూడా తమ కవితలను గానం చేయవచ్చని ఆంధ్ర సారస్వత పరిషత్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి రామాల వెంకటరామిరెడ్డి తెలిపారు. పాల్గొనే కవులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 86394 08444 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం రచయితల సంఘ అధ్యక్షుడు షేక్ మహబూబ్ జాన్, కనిగిరి సాహితీ సుధ ప్రధాన కార్యదర్శి పాలూరి శివప్రసాద్, కొండలు, రవికుమార్, సునీత పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పకి మకర విళక్కు


అయ్యప్పస్వామి పడి పూజలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు రోడ్డులోని గాంధీనగర్లో వైఎస్సార్ బొమ్మ దగ్గర సోమవారం సాయంత్రం నాగిరెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి మకర విళక్కు పడి పూజను వైభవంగా నిర్వహించారు. వేద పురోహితులు చక్రవర్తి ఆధ్వర్యంలో ముందుగా గణపతి పూజ నిర్వహించి శివలింగానికి అయ్యప్ప ఉత్సవమూర్తికి ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అయ్యప్ప అష్టోత్తర శత నామ పూజ నిర్వహించారు. 18 మెట్ల పడిపూజలో ప్రత్యేక అలంకరణ గావించి 18 మెట్లకు కర్పూర హారతి వెలిగించి భక్తులకు, మాలధారులకు అయ్యప్ప దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో మాలధారణ భక్తులందరూ పాల్గొని భక్తిగీతాలు ఆలపించారు. నాగిరెడ్డి గురుస్వామి, పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి, వేద పురోహితుడు చక్రవర్తి, భక్తులు పాల్గొన్నారు.

వాతావరణ ప్రభావాలపై ఎంపీ మాగుంట ప్రశ్న

ఒంగోలు: ఆంధ్ర తీర ప్రాంతంలో వాతావరణ ప్రభావాల తగ్గింపుపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నించారు. భౌగోళిక పరిస్థితుల వల్ల ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలో వచ్చే వడగాలులతో సంభవించే తీవ్ర వాతావరణ ప్రభావాల తగ్గింపునకు రాష్ట్రాల ఒప్పందంతో కేంద్రం రూపొందించిన పథకాలు, వాటి నిర్వహణకు రాష్ట్రం అందించిన ఆర్థిక సాయం గురించి ప్రశ్నించారు. దీనికి కేంద్ర భూశాస్త్ర శాఖామంత్రి కిరణ్ రిజుజు సమాధానం ఇస్తూ ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల తీర ప్రాంతాల్లో సంభవించే తీవ్ర సంఘటనలు, వడగాలుల వల్ల జరిగే ప్రాణ, ఆస్తుల నష్ట నివారణకు పర్యవేక్షణ, ముందస్తు హెచ్చరికల విధానాలను మెరుగుపరిచేందుకు భారత వాతావరణ శాస్త్ర శాఖ పలు చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు , విపత్తు నిర్వహణ ఏజెన్సీలు ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు దేశంలోని అనేక ప్రాంతాల్లో సంభవించే వాతావరణ ప్రభావాలు, వడగాలుల తీవ్రత గురించి ఎప్పటికప్పుడు ముందస్తుగా తెలియజేయడం, రోజువారీ ఉష్ణోగ్రత, గాలులు, తేమ పరిస్థితి గురించి అన్ని మాధ్యమాల్లో హెచ్చరికలు చేయడం, సకాలంలో ప్రజలకు తెలిపేదానికి ఆధునిక ఉపకరణాలను ఉపయోగిస్తారన్నారు.





